# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలలో పర్యటిస్తారు.
3. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సరికొత్త పారిశ్రామిక విధానం అందుబాటులోకి తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.
4. ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణి కార్యక్రమం ఈ రోజు ప్రారంభమైంది.
5. తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం స్వీకారం చేశారు.
6. తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు తల్లి పాల వారోత్సవాలు ఈ రోజు నుండి ప్రారంభమవుతున్నాయి.

==========================

వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. నిన్న రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ.. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా ఆవిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో ద్రవ్యలోటును ప్రస్తుత ఏడాదికి.. 4.9 శాతానికి.. వచ్చే ఏడాది 2025-26 నాటికి 4.5 శాతానికి తగ్గించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ..

వాయిస్ (41 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలలో పర్యటిస్తారు. ఈ ఉదయం ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరి నంద్యాల జిల్లాలోని శ్రీశైలానికి చేరుకుంటారు. అక్కడ శ్రీశైలం ప్రాజెక్టును ముఖ్యమంత్రి సందర్శించి కృష్ణా నది జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించి సున్నిపెంట వాటర్ యూజర్స్ అసోసియేషన్

సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. అనంతరం ముఖ్యమంత్రి శ్రీ సత్యసాయి జిల్లా పర్యటన చేపడతారు. పింఛన్ల పంపిణీలో భాగంగా జిల్లాలోని మడకశిర మండలం గుండుమల గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి ముఖ్యమంత్రి నగదును అందజేస్తారు. అనంతరం గ్రామంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు సరికొత్త పారిశ్రామిక విధానం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం అమరావతిలో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, 100 రోజుల్లో కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం, లేపాక్షి, దొనకొండ, మూలపేట ప్రాంతాల్లో కొత్తగా నాలుగు పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేస్తున్నామని, శ్రీ సిటీ తరహాలో వీటిని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్య విధానంలో అన్ని వసతులతో కూడిన పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఈ రోజు నుండి ప్రారంభమైంది. లబ్ధిదారులకు ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల నగదును గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే పంపిణీ చేస్తున్నారు. ఈ నెలకు సంబంధించి 64.82 లక్షల మందికి వివిధ రకాల పింఛన్ల పంపిణీకిగాను 2 వేల 7 వందల 87 కోట్ల 41 లక్షల రూపాయలను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి రోజే 99శాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని.. ఒకవేళ సాంకేతిక సమస్యలు ఎదురైతే రెండోరోజు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నిన్న ప్రమాణం స్వీకారం చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే.. ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. ఇలా ఉండగా 1957 ఆగస్టు 15న జన్మించిన జిష్ణుదేవ్ వర్మ.. త్రిపుర రాష్ట్రానికి రెండవ ఉప ముఖ్యమంత్రిగా 2018 నుంచి 2023 సంవత్సరం వరకు పని చేశారు.

---------------------------

రంగారెడ్డి జిల్లాలోని ముచ్చెర్ల ప్రాంతాన్ని ప్రాధాన్యత నగరంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చెప్పారు. నిన్న హైదరాబాద్ లోని శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. జంటనగరాలతో పాటు ముచ్చెర్లను భవిష్యత్తు నగరంగా ఆవిష్కరించేందుకు ఈ రోజు అక్కడ యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. బీసీసీఐతో సంప్రదించి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా విశ్వవిద్యాలయాన్నీ నిర్మిస్తామని పేర్కొన్నారు. ముచ్చర్ల వరకు మెట్రో, ఎంఎంటీఎస్ రైల్వే సేవలను విస్తరిస్తామన్నారు. ఔషధ సంబంధిత పరిశ్రమలను నాలుగువేల ఎకరాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు తల్లి పాల వారోత్సవాలు ఈ రోజు నుండి ప్రారంభమవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన ఒక తీర్మానం మేరకు ప్రతి ఏటా ఆగస్టు 1వ తేదీ నుండి వారంరోజులపాటు ప్రపంచ దేశాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. శిశువుకు తల్లిపాలు మంచి పౌష్టికాహారమని... ఎంతో సురక్షితమైనవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో రోగ నిరోధక శక్తి పొందాలంటే తల్లి పాలకు మించిన దివ్య ఔషధం మరొకటి లేదని... బిడ్డ పుట్టిన మొదటి అరగంట లోపు తల్లి నుండి వచ్చే ముర్రుపాలు బిడ్డకు సమతుల పోషకాహారాన్ని అందజేస్తాయని కూడా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. తల్లి పాల విశిష్టతను తెలియజేస్తూ కేంద్ర, ప్రభుత్వాలు ఈ వారం రోజుల పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

---------------------------

దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షాత్మక జిల్లాలు, విభాగాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కొరకు నీతి ఆయోగ్ 3 నెలల పాటు 'సంపూర్ణతా అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. సెప్టెంబర్ 30 వరకు ఈ ప్రచారం కొనసాగుతుంది. దేశ వ్యాప్తంగా ఆకాంక్ష జిల్లాల్లో 6 సూచికలు, ఆకాంక్ష బ్లాకుల్లో 6 కీలక సూచికల సంతృప్తతను సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆకాంక్షాత్మక జిల్లాలు, విభాగాల సంపూర్ణతా అభియాన్‌పై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి, ప్రజారోగ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతి సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛను అందిస్తామని తెలిపారు. కూటమిపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పలు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశాయిని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

---------------------------

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఆగస్టు 1వ తేదీ నుంచి నిషేధం విధిస్తూ ఆర్థికశాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. జులై 5 నుంచి 31వ తేదీ వరకూ బదిలీలపై నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అయితే ఈ గడువు పూర్తయినందున మళ్లీ నిషేధం అమల్లోకి వచ్చినట్లు ఆర్థికశాఖ ఉత్తర్వులో పేర్కొంటూ కొన్ని ప్రత్యేక అంశాలను మినహాయించినట్లు వివరించింది. నిషేధం ఉన్నందున ఏ శాఖలో ఏ నిబంధనల కింద మినహాయింపులతో బదిలీ చేసినా తప్పనిసరిగా ఆర్థికశాఖ అనుమతి పొందాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో ఈరోజు నుండి రాత్రి 8 గంటల 30 నిమిషాలకు 'జాతీయ వార్తలు' పేరిట కొత్త న్యూస్ బులెటిన్ ప్రారంభం అవుతోందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా

విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి తెలిపారు. ఈ న్యూస్ బులెటిన్ ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగంలో రెండవదిగా పేర్కొన్నారు. ఈ బులెటిన్ రాత్రి ఎనిమిదిన్నర గంటల నుండి ఎనిమిది గంటల నలభై నిముషాల వరకూ ప్రతీ రోజూ ప్రసారం అవుతుందని తెలిపారు. ఇక సాయంత్రం ఆరు గంటల పది నిముషాల నుండి ఆరు గంటల ఇరవై నిముషాల వరకు ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తలు యధాతథంగా కొనసాగుతాయని వివరించారు. ఆకాశవాణి శ్రోతలు కొత్త న్యూస్ బులెటిన్‌ని కూడా ఆదరించాలని శ్రీసాయి వెంపాటి కోరారు.

---------------------------

వాహనాల ఫాస్టాగ్ సేవలపై ఈ రోజు నుంచి కొత్త నిభంధనలు అమల్లోకి వస్తున్నాయి. వాహనం కొనుగోలు చేసిన 90 రోజులలోపు వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఫాస్టాగ్ నంబర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా –ఎన్‌పీసీఐ ఫాస్టాగ్‌కి సంబంధించి జూన్‌లో విడుదల చేసిన మార్గదర్శకాలలో తెలిపింది.

======================